ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 23.12.2024 సమయం13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. దేశ వ్యాప్తంగా ఈరోజు నిర్వహించిన రోజ్ గార్ మేళాలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 71 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందచేశారు. రాష్ట్రంలో జరిగిన కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ పాల్గొన్నారు.

2. వ్యవసాయ రుణాల పంపిణీలో బ్యాంకర్లు వేగం పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ రోజు నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో కోరారు.

3. సింగరేణి బొగ్గు గనుల కేంద్రాల్లో ఈరోజు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.

4. మాజీ ప్రధాని పి.వి. నరసిహారావు 20వ వర్దంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు ఘనమైన నివాళులు అర్పిస్తూ , దేశ ఆర్ధిక ప్రగతికి దిశా నిర్దేశం కావించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు.

**DAY PM-ROZGAR MELA:**

ఈరోజు దేశ వ్యాప్తంగా నిర్వహించిన రోజ్ గార్ మేళా కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొత్తగా ఎంపికైన 71 వేల మందికి నియమాక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... గత ఏడాదిన్నర కాలంలో దేశంలో యువజనులకు 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు ఈరోజు తెలియజేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు,

ప్రభుత్వ సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. రోజ్గార్ మేళాల ద్వారా యువజనులకు సాధికారత కల్పించగలుగుతున్నామన్నారు. యువత శక్తి యుక్తులను పూర్తిగా వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు . దేశ యువజనుల ప్రతిభను నైపుణ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం , వారికి గుర్తింపు ఇవ్వడం ప్రభుత్వ ప్రాధాన్యత అని ప్రధాని తెలియజేశారు.

(ఎన్ ఎస్ డి)

**KISHAN REDDY – ROJGAR MELA**

యువతకు ఉద్యోగాలు కల్పించి, దేశ సేవలో యువతను భాగస్వామ్యం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం రోజ్ గార్ మేళా నిర్వహిస్తుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్, చంద్రాయణ గుట్టలోని సిఆర్ పి ఎఫ్ లో జరిగిన 11వ రోజ్ గార్ మేళాలో మంత్రి పాల్గొని, కొత్తగా ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇప్పటి వరకు రోజ్ గార్ మేళాలో పది లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. మరో రెండు లక్షల ఉద్యోగ నియామకాలను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వంలో ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటుగా ప్రైవేటు రంగంలో కూడా ఉపాధి అవకాశాలను మెరుగు పర్చుకోవడం జరుగుతుందన్నారు.

(డెస్క్)

**BANDI SANJAY _ ROJGAR MELA**

మేక్ ఇన్ ఇండియా , స్టార్టప్ ఇండియా , స్టాండ్ అప్ ఇండియా అనే గొప్ప కార్యక్రమాలతో 'ఆత్మనిర్భర్ భారత్' ద్వారా సర్వతోముఖాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లోని ఎన్ ఐ ఎస్ ఎ కేంద్రంలో సిఐఎస్ఎఫ్ నిర్వహించిన రోజాగర్ మేళాలో మంత్రి మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి ఫలితాలు చివరి లబ్ధిదారులకు కూడా చేరాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన యువత దేశాభివృద్ధికి దోహదపడేలా

అంకితభావంతో పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా  కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఎంపికైన  348 మందికి నియామక పత్రాలను కేంద్ర మంత్రి అందజేశారు. రోజ్‌గార్ మేళాలో నిసా డైరెక్టర్ కె. సునీల్ ఇమ్మాన్యుయేల్ , శ్రీనివాస్‌బాబు, డిడి ఎన్ ఐ ఎస్ ఎ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

(MSM)

**DY CM**

రాబోయే రోజుల్లో వైబ్రెంట్ తెలంగాణ  రాష్ట్రాన్ని  చూడబోతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా భవన్ లో ఆయన ఈ రోజు బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ప్రగతిదాయకమై అభివృద్ధి నమూనాల కోసం దేశం యావత్తు తెలంగాణ వైపు చూస్తుందని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అన్నారు. త్వరలోనే రీజినల్ రింగ్ రోడ్ పనులకు టెండర్లను పిలుస్తామన్నారు. వార్షిక బడ్జెట్ లో వ్యవసాయం , సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి బ్యాంకర్లు సహకరించాలని కోరారు. వ్యవసాయ రుణాల పంపిణీలో వేగం పెంచాలన్నారు.

(desk)

**GOVERNOR - ABVP**

సిద్దిపేట జిల్లాలో నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభల ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా  గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , ఇతర అతిథిలను ఏబీవీపీ రాష్ట్ర నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ అఖిల భారత సంఘటన కార్యదర్శి అశీష్ చౌహాన్, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

(PTC)

**SINGARENI - MANCHIRYALA**

సింగరేణి  బొగ్గు గని   ఆవిర్భావ దినోత్సవ వేడుకలు   రాష్ట్ర వ్యాప్తంగా  అన్ని సింగరేణి బొగ్గు గనుల కేంద్రాల్లో    ఘనంగా జరుగుతున్నాయి. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్     ,  మందమర్రి డివిజన్లలో బొగ్గు గనుల వద్ద కార్మికులు సంబరాలు చేసుకున్నారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు. మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మందమర్రి జీఎం దేవేందర్  ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగరేణి అధికారులు మాట్లాడుతూ... రక్షణతో కూడిన ఉత్పత్తి కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.
(PTC, మంచిర్యాల)

**SINGARENI – DY CM**

సింగరేణి కాలరీస్ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమర్క సింగరేణి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్ర , దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో లక్షల మందికి ప్రత్యక్షంగా,  పరోక్షంగా జీవనాధారంగా ఉన్న సింగరేణి సంస్థ సుస్థిత భవిష్యత్ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శ్రమ శక్తిని  చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి  ఒక్కరు పునరంకితమవ్వాలని ఆయన కోరారు.
(ప్రెస్ నోట్)

**PV VARDHANTHI**

మాజీ ప్రధాని పి. వి. నరసిహారావు       20వ వర్ధంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు ఘనమైన నివాళులు అర్పించారు. నెక్లెస్ రోడ్ లోని జ్ఞాన భూమిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు ఆయన సమాధిపై పుష్పగుచ్చాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ ఆర్థిక ప్రగతికి దిశా నిర్దేశం కావించిన ఘనత పీ వీ నరసింహరావుకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సందేశంలో పేర్కొన్నారు. పీ వీ

వర్ధంతి సంధర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కూడా పీవీ నరసింహారావు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమంటూ నివాళులు అర్పించారు.

(డెస్క్)

**TRAFFIC- TRANCE GENDERS**

హైదరాబాద్ లో ఈరోజు నుంచి 39 మంది ట్రాన్స్ జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించనున్నారని నగర పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్ తెలిపారు. ఇప్పటికే వారందరికీ 15 రోజుల పాటు ట్రాఫిక్ పోలీసులు శిక్షణ ఇచ్చారన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ , పనితీరుపై వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. ట్రాన్స్ జెంటర్లను వారి ప్రతిభ ఆధారంగా ఇతర విభాగాల్లో కూడా నియమించుకునే ఆలోచన పరిశీలనలో ఉందన్నారు.

(ప్రెస్ నోట్)

**SIRCILLA**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే రాజన్న సిరిసిల్ల జిల్లాలో చురుకుగా కొనసాగుతోంది. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా అర్హుల వివరాలు సేకరిస్తున్నామని డి ఆర్ డి ఓ శేషాద్రి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండు మున్సిపాలిటీలు , 13 మండలాల్లో లక్షకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రభుత్వానికి అందిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నామని చెప్పారు.

(PTC)

**వనపర్తి జిల్లా**

వనపర్తి జిల్లా లోని బలిజపల్లి గ్రామాన్ని గ్రామపంచాయతీ గా కొనసాగించాలి , జంగమయ్యపల్లి గ్రామ పంచాయతీలో విలీనం చేయవద్దు అనీ బలిజపల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా పెద్దమందడి మండలం ,బలిజపల్లి గ్రామప్రజలు వనపర్తి - ఖిల్లా ఘణపురం

వెళ్లే రహదారిపై ఈరోజు గ్రామస్తులు ధర్నా చేపట్టారు.                జిల్లాలోని పెద్ద మందడి మండలం,బలిజపల్లి, జంగమాయపల్లి జంట గ్రామాలను వేరు , వేరు గ్రామ పంచాయితీలుగా కొనసాగించాలి డిమాండ్ చేస్తున్నారు. రస్తా రోకో కారణంగా రహదారిపై రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవాడంతో రాకపోకలు స్తంభించిపోయాయి.

PTC, వనపర్తి

**WARANGAL _ MP KAVYA**

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన జమిలీ బిల్లను అడ్డుకుంటామని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య తెలిపారు. ఈ రోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రల మీద ఆధిపత్యం కోసమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంటు ముందుకు తెచ్చిందన్నారు. దళిత, మైనార్టీల ప్రయోజనాల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

(పిటీసీ)